దామర్ల చెరువులో రెచ్చిపోయిన మట్టి మాఫియా

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండలం హనుమంతరాయునిపల్లి గ్రామ సమీపంలోని దామర్ల చెరువులో మట్టి మాఫియా రెచ్చిపోయి అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టారు. గుర్తు తెలియని వ్యక్తులు రెండు జెసిబిల సహాయంతో 10 ట్రాక్టర్లను పెట్టి మట్టిని తరలిస్తున్నారు. ఆదివారం కావడంతో మట్టి మాఫియాకు ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారు. గత కొద్ది రోజులుగా ప్రభుత్వ అధికారులకు సెలవు ఉన్న రోజే మట్టి మాఫియా రెచ్చిపోయి మట్టి తరలిస్తున్నారు. ట్రాక్టర్ 500 రూపాయలు నుంచి 600 రూపాయల వరకు అమ్ముకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి మట్టి మాఫియా పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

విశాలాంధ్ర
ప్రకాశం జిల్లా

నేటి నుంచి లెప్రసీ సర్వే ప్రారంభం

- వైద్యాధికారి ఎస్పీ బాలయ్య

విశాలాంధ్ర-కొనకనమిట్ల : కొనకనమిట్ల మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో నేడు అనగా సోమవారం 26 తేదీనుంచి జూలై నెల 16వ తేదీ వరకు లెప్రసీపై ఇంటింటా సర్వే జరుగుతుందని వైద్యాధికారి ఎస్పీ బాలయ్య తెలిపారు ఈ సందర్భంగా ఆశ ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు ఆశా కార్యకర్తలు ఆరోగ్య కార్య కర్తలు ఇంటింటికి వచ్చి లెప్రసీ లక్షణాలున్నట్లయితే వారికి తెలియజేయాలని ఒకవేళ ఉన్నట్లయితే వెంటనే డాక్టర్ను సంప్రదించాలని కోరారు లెప్రసీ లక్షణాలు శరీరంపై రాగి రంగు గల స్పర్శ లేని మచ్చలు పొడలు ఉన్నట్లయితే ఆరోగ్య సిబ్బందికి తెలియజేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సురేఖ, ఎంపిహెచ్ఓ అబ్దుల్ జలీల్, నోడల్, పర్సన్ ప్రతాపరెడ్డి సిహెచ్ఓ రత్నమ్మ హెల్త్ సూపర్వైజర్ శ్యామల పీహెచ్ శైలజ ఆరోగ్య ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లమలలో రెండు రోజులు గడిపిన మంత్రి సురేష్

- గిరిపుత్రుల సమస్యల పరిష్కారమే ధ్యేయమని వెల్లడి
- ప్రత్యేక వాహనాల్లో క్లిష్టమైన ప్రయాణం

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : దట్టమైన నల్లమల అడవి ప్రాంతంలో ప్రత్యేక వాహనాల ద్వారా క్లిష్టమైన ప్రయాణాన్ని కొనసాగించడంతోపాటు రెండు రోజులపాటు గిరిజనుల మధ్య రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ గడిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో పాటు పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేసే ఆయన శని, ఆదివారాలు యర్రగొండపాలెం మండలం పాలుట్ల గిరిజన గూడెంలో గడిపారు. అడవి ప్రాంతంలో సరిగా లేని రవాణా సౌకర్యం కారణంగా ప్రత్యేక వాహనాల ద్వారా దాదాపు నాలుగు గంటల పాటు అధికారులు పార్టీ నాయకులతో కలిసి ఆయన ప్రయాణించి పాలుట్ల చేరుకున్నారు. కనీసం సెల్ సిగ్నల్ కూడా లేని ప్రాంతం కావడంతో సంబంధం లేకుండా గిరిజనుల మధ్య అధికారులు మంత్రి రెండు రోజులు గడిపారు. గతంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. నారుతడికల, పొన్నలబయలు, పాలుట్ల గూడెంలలో ఆయన పర్యటించారు. ఆదివారం ఉదయం నుంచి గిరిజనులతో మమేకమైన మంత్రి సురేష్ వారి సమస్యలను తెలుసుకుంటూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తం 25 మంది చెంచులకు ఐటిడిఎ ద్వారా గొర్రెలు మేకల పెంపకం కోసం 2.75 లక్షల రూపాయలను చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. అరుపులైన వారికి రేషన్ కార్డులు పంపిణీ, ఉపాధి హామీ పథకంలో పనులు చేసుకునేందుకు 150 రోజులు పాటు పరిధిలో కల్పిస్తూ కొందరికి జాబ్ కార్డులు పంపిణీ చేశారు. పాలుట్ల గిరిజన గూడెంకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. గూడెంలో ఎక్కువమంది ఇళ్ల నిర్మాణం కోసం మంత్రికి విన్నవించుకోగా ఇంటి స్థల పట్టాలు లేని కారణంగా ఇల్లు మంజూరు కాలేదని అధికారుల ద్వారా మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఆర్ఓఎఫ్ ఆర్ పట్టాలు పెండింగ్లో ఉన్నాయని తెలుసుకున్న మంత్రి ఈ విషయాన్ని సబ్ కలెక్టర్ జిల్లా కలెక్టర్ ద్వారామాట్లాడి తక్షణమే ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. గూడెంలో అంతర్గత రహదారుల అభివృద్ధి కోసం కొన్నింటిని గ్రావెల్ రోడ్లు మరికొన్ని సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి పరుస్తామని మంత్రి వారితో చెప్పారు. తాగునీటి సమస్య పరిష్కారానికి కూడా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గిరిజన అభివృద్ధికి అటవీ అధికారుల ఆంక్షలు అడ్డంకిగా ఉన్నాయని, కొన్ని విషయాల్లో మానవతా దృక్పథంతో కొన్నింటికి అటవీ శాఖ అధికారులు కూడా సహకరించాలని ఆయన కోరారు. గిరిజనుల సమస్యల పరిష్కారం కోసమే ప్రత్యేకంగా రెండు రోజులు పాటు మీతో గడిపేందుకు వచ్చామని, గిరిజన అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలను మంత్రి వారికి వివరించారు. గూడెంలో గిరిజనులు మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. రెండు రోజులపాటు అధికారులకు, పార్టీ నాయకులకు గూడెంలోని గిరిజనులకు మంత్రి సురేష్ భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యల ఆత్మీయ సమ్మేళనలో పందిటి, తడికమల్ల, మెంటా

విశాలాంధ్ర-పామూరు : ప్రకాశం జిల్లా ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనలో పాల్గొన్న కర్నూల్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సోమిశెట్టి సుబ్బారావు, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు దుండి రాకేష్, జగ్గయ్యపేట టీడీపీ ఇంచార్జ్ శ్రీరామ్ తాతయ్యలు పాల్గొన్నారు. వారిని పామూరు పట్టణ తెలుగుదేశం పార్టీ పట్టణ వాణిజ్య విభాగం అధ్యక్షులు పందిటి హరీష్, మెంటా నరసింహారావు, పెసల నరసింహారావు, సోమిశెట్టి శ్రీను, తడిక మల్ల సుబ్బారావులు మర్యాదపూర్వకంగా కలిశారు.

గ్రంథాలయంలో చదవడం నాకిష్టం

విశాలాంధ్ర-టంగుటూరు : మండల కేంద్రమైన టంగుటూరులోని స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం నాకిష్టం కార్యక్రమాన్ని గ్రంథ పాలకులు గుమ్మడి వర్ధనరాజు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమకిష్టమైన బుక్స్‌ను తీసుకొని చదివారు. అదే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు కూడా అధిక సంఖ్యలో హాజరై ప్రపంచంలో జరుగుతున్న వివిధ రకాల విషయాల గురించి తెలుసుకుంటున్నారని గ్రంథ పాలకులు తెలిపారు.

ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీటీసీ

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : హనుమంతునిపాడు మండల పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సబ్ ఇన్స్పెక్టర్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన పులి శివ నాగరాజును హనుమంతునిపాడు మండల పరిధిలోని ఉన్న నందనవనం ఎంపీటీసీ సూరిశెట్టి నారాయణస్వామి మర్యాదపూర్వకంగా కలసి ఎస్సై పులి శివ నాగరాజును శాలవాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : హనుమంతునిపాడు మండల పోలీస్ స్టేషన్ లో శుక్రవారం సబ్ ఇన్స్పెక్టర్ గా నూతన బాధ్యతలు చేపట్టిన పులి శివ నాగరాజును హనుమంతునిపాడు మండల టీడీపీ నాయకులు మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గాయం తిరుపతిరెడ్డి, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, గాయం కృష్ణారెడ్డి,గంగిరెడ్డి రమేష్ రెడ్డి,మువ్వా రంగసాయి యాదవ్,కోటపాటి శేషయ్య, మాసెపోగు ఎర్రయ్యలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలసి ఎస్సై పులి శివ నాగరాజును శాలవాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

శుభాకాంక్షలు తెలిపిన కస్తాల బాలాజీ

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : హనుమంతునిపాడు మండల పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సబ్ ఇన్స్పెక్టర్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన పులి శివ నాగరాజును హనుమంతుని పాడు మండల పరిధిలోని ఉన్న తిమ్మారెడ్డిపల్లి వైసీపీ ఇంచార్జ్ కస్తాల బాలాజీ మర్యాదపూర్వకంగా కలసి ఎస్సై పులి శివ నాగరాజును శాలవాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, సర్పంచ్ సానికొమ్ము మధుసూదన్ రెడ్డి,వెంకీ తదితర వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ తిరుణాల

విశాలాంధ్ర-పామూరు : పట్టణంలో శ్రీ పోలేరమ్మ తల్లి తిరునాళ్లను ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుండి పట్టణములోని నాలుగు వైపులా ఏర్పాటు చేసి ఉన్న బొడ్డు రాయిలను కడిగి పూజించి పూజలు చేశారు. అనంతరం పెదకాపు పేరం బ్రదర్స్ ఇంటి వద్ద నుండి వందలాదిమంది భక్తులు పాలపొంగళ్ళు తో ఊరేగింపుగా వెళ్లి పోలేరమ్మ తల్లికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి ప్రతి ఇంట పాడిపంటలు సమృద్ధిగా కలగాలని, అంటువ్యాధుల బారిన పడకుండా ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీ పోలేరమ్మ తల్లిని ప్రజలు కోరుకున్నారు. వైసీపీ మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డి, పట్టణ ఉప సర్పంచ్ యాదాల వెంకట సాయి కిరణ్‌లు పాల్గొని పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలను చల్లగా చూడాలని కోరుకున్నారు.

వైసీపీ నేత కృష్ణ మోహన్‌రెడ్డిని సన్మానించిన దళితులు

విశాలాంధ్ర-మార్కాపురం : స్థానిక అర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో వైఎస్సార్సీపీ యువ నాయకుడు కుందురు కృష్ణ మోహన్‌రెడ్డిని కొనకనమిట్ల మండలం చిన్నారికట్ల గ్రామానికి చెందిన దళితులు పూలమాల వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. చిన్నారికట్ల గ్రామానికి చెందిన సిరుగురి యోన, మరియమ్మలు తమ సమస్యలను పరిష్కరించాలని కృష్ణ మోహన్‌రెడ్డికి ఫోన్ ద్వారా తేలుపగా వెంటనే స్పందించి వారి సమస్యలను పరిష్కరించారు. అందుకు కృతజ్ఞతగా కృష్ణ మోహన్‌రెడ్డికి దళితులైన శిరుగురి రవికుమార్(కన్న) ఆధ్వర్యములో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమములో వైఎస్సార్సీపీ నాయకులు బుదాల సతీష్, పొన్నం కుమారి, కొనంకి ఆదాము, చినబాబు నర్సయ్య, నర్సింహా, నాగేంద్ర ధర్మ పాల్గొన్నారు.

విగ్రహ ఆవిష్కరణలో 'కామూరి'

విశాలాంధ్ర-కొమరోలు : గిద్దలూరు నియోజకవర్గం కొమరోలు మండలంలోని వెన్నంపల్లె గ్రామంలో హీరో, సూపర్ స్టార్, పద్మభూషన్ డాక్టర్ స్వర్గీయ ఘట్టమనేని కృష్ణ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న గిద్దలూరు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు అన్నదాత మనోజ్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, రాజన్న భోజనశాల వ్యవస్థాపకులు కామూరి రమణారెడ్డి మరియు మహిధర్. బిసి అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల పాటి సూర్యనారాయణ బాబు (కృష్ణ బామ్మర్ది) ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కృష్ణ అభిమానులకు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు అభిమానులకు "నాన్ వెజ్" భారీ అన్నదాన కార్యక్రమాన్ని కామూరి రమణారెడ్డి ఏర్పాటు చేశారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

విశాలాంధ్ర-కొమరోలు : ప్రభుత్వ వైద్యశాలలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంపీపీ కామూరి అమూల్య తెలిపారు. కొమరోలు పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.

మస్తాన్ వలి మాతృమూర్తిని పరామర్శించిన ఎమ్మెల్యే అన్నా

విశాలాంధ్ర-గిద్దలూరు : నగర పంచాయతీ వైసీపీ నాయకులు,కో ఆప్షన్ సభ్యులు షేక్.మమస్తాన్ వలి మాతృమూర్తి అనారోగ్యంతో బాధపడుతుండగా విషయం తెలుసుకున్న శాసన సభ్యులు అన్నా వెంకట రాంబాబు ఆదివారం ఆమెను పరామర్శించారు. అనంతరం ఆమెకు అందుతున్న వైద్య సేవలు గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

ప్రైవేటు కార్యక్రమంలో 'ముత్తుముల'

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని ఎస్.ఎస్ ప్లాజాలో స్థానిక 2వ వార్డుకు చెందిన మారుగాని రాజు, పద్మావతి దంపతుల కుమార్తె జశ్విత ఓణీల కార్యక్రమానికి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మహానంది యాదవ్, పందిళ్ళపల్లి శ్రీనివాసులు, కొమరోలు మండల టిడిపి అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, బేస్తవారిపేట టిడిపి నాయకులు సత్వేలి కృష్ణ యాదవ్, పట్టణ టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాంబయ్య సేవలు మరువలేనివి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : సీపీఐ నేత యరజర్ల సాంబయ్య సేవలు మరువలేనివని సీపీఐ సీనియర్ నాయకులు టిసిహెచ్ చెన్నయ్య అన్నారు. ఆదివారం యర్రగొండపాలెం లోని సీపీఐ కార్యాలయంలో యరజర్ల సాంబయ్య 9వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ నాయకులు వై వెంకట శివయ్య అధ్యక్షతన జరిగిన సభలో చెన్నయ్య మాట్లాడుతూ సాంబయ్య లైన్మెన్‌గా పనిచేస్తూ కమ్యూనిస్టు పార్టీలో పేద ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాడే వారిని అన్నారు. 1983లో కామ్రేడ్ పూలసుబ్బయ్య గెలుపు కోసం యెనలేని కృషి చేశారన్నారు. ఈ సభలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి కృష్ణ గౌడ్, సీపీఐ త్రిపురాంతకం మండల కార్యదర్శి బాణాల రామయ్య పాల్గొన్నారు.

సినీ నటుడు కృష్ణ విగ్రహం ఆవిష్కరణ

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండలం వెన్నంపల్లి గ్రామంలో సినీ నటుడు సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు అభిమానుల సంఘం అధ్యక్షుడు కాశిరెడ్డి, అభిమానుల సంఘం ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సినీ నటుడు కృష్ణ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమనికి వైసిపి నాయకులు కామూరి రమణారెడ్డి, సూపర్ స్టార్ కృష్ణ బామ్మర్ది ఉప్పలపాటి సూర్యనారాయణ బాబు హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. సూపర్ స్టార్ కృష్ణ పై అభిమానంతో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసిన వెన్నంపల్లి గ్రామస్తులను సూర్యనారాయణ బాబు అభినందించారు. కార్యక్రమానికి హాజరైన ప్రజలకు కామూరి రమణారెడ్డి ఆధ్వర్యంలో నాన్ వెజ్ భోజనం ఏర్పాటు చేశారు. కామూరి రమణారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కృష్ణ అభిమానులు గ్రామస్తులు పలువురు ప్రముఖులు కామూరి అభిమానులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న టిప్పర్

- ఇద్దరికి గాయాలు

విశాలాంధ్ర-సింగరాయకొండ : ఆగి ఉన్న లారీని టిప్పర్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సింగరాయ కొండలోని కలికివాయ ఫ్లై ఓవర్ వద్ద మెకానికల్ ప్రాబ్లం వలన లారీ ఆగింది. ట్రాఫిక్ కోన్స్ పెట్టి లారీని రిపేర్ చేస్తుండగా వెనక నుండి వస్తున్న టిప్పర్ డ్రైవర్ నిద్ర మత్తులో లారీని బలంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో టిప్పర్ డ్రైవర్ ఫ్రేమ్ క్లీనర్ అహ్మద్ హఫీజ్ తీవ్రగాయలపడంతో సమాచారం అందుకున్న సింగరాయకొండ ఎస్సై శ్రీరామ్ హైవే మొబైల్ పోలీసులు వెంటనే సంఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించి గాయపడిన వారిని హైవే అంబులెన్స్‌లో ఒంగోలు క్రిమ్స్ హాస్పిటల్ తరలించారు. ఎస్సై శ్రీరామ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అరాచక పాలనను అంతమొందించండి

ఎమ్మెల్యే బాల వీరాంజనేయ స్వామి, మాజీ ఎమ్మెల్యే 'ఉగ్ర'

విశాలాంధ్ర-వెలిగండ్ల : వైసీపీ అరాచకాలు అంతమొందించాలని తెలుగుదేశం నాయకులు జిల్లా ఇన్చార్జి నూకసాని బాలాజీ, కొండేపి నియోజకవర్గ ఎమ్మెల్యే బాల వీరాంజనేయ స్వామి కనిగిరి నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టరు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. తెలుగుదేశం గ్యారెంటీ భరోసా యాత్ర తమ్మినేనిపల్లికి శనివారం సాయంత్రం మూడు గంటలకు చేరుకోవటంతో తెలుగు తమ్ముళ్లు పెద్ద ఎత్తున బాణ సంచా కాలుస్తూ, భాజా భజంత్రీలతో ర్యాలీగా హారతి పడుతూ భారీగా తరలివచ్చారు. అనంతరం మొగులూరు లో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విడుదల చేసిన మొదటి విడత మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు మొగులూరులో ప్రజలతో మమేకమయ్యారు వెలిగండ్లలో ముందుగా అంబేద్కర్ విగ్రహానికి అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తుందని చెప్పేది ఒకటి చేసేది మరొకటిగా గారడి చేస్తున్నారని అన్నారు. దళిత మైనార్టీ ప్రజలపై రాష్ట్ర వ్యాప్తంగా దాడులు జరుగుతూ చంపి వేస్తున్న కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏమి మాట్లాడకుండా చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని దళితులకు మేనల్లుడు నడిచెప్పిన జగన్ ఆ వర్గాలపై దాడులు జరుగుతుంటే చోద్యం చూస్తూ ఉండటం ఏమిటని అన్నారు, వెలిగండ్లలో తెలుగుదేశం హయాంలో గన్నవరం బ్రిడ్జిని టిడిపి హయాంలో పిల్లర్లు ఏర్పాటు చేసినామని దానిపైన స్లాబ్ చేయడం కూడా వారికి చేతకావడం లేదని అన్నారు నిరుద్యోగులు చదువుకొని ఉద్యోగ ఉపాధి లేక పరువు రాష్ట్రాలు, దేశాలకు వలస పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గం క్లస్టర్ ఇంచార్జ్ దొడ్డ వెంకటసుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు గోదగట్ల మాలకొండయ్య, మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే జగనన్న లక్ష్యం: చైతన్య

విశాలాంధ్ర - బల్లికురవ : రాష్ట్ర ప్రజల అభివృద్ధి సంక్షేమమే అజెం డాగా మారుమూల గ్రామాలలో సైతం ప్రజలకు సకల సౌకర్యాలు కల్పించా లనే లక్ష్యంతో ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని శాప్ నెట్ చైర్మన్ అద్దంకి నియోజ కవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచా ర్జ్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొప్పరపాలెం, కే రాజుపాలెం గ్రామాలలో పలు ప్రారంభోత్సవాలు, అభివృద్ధి కార్యక్రమాలకు శంకు స్థాపనలు చేశారు. కొప్పెరపాలెం గ్రామంలో రూ. 40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవ నాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం కే రాజు పాలెం గ్రామంలో ఎన్ఎస్పి కెనాల్ నుండి మంచినీటి చెరువుకు రూ. 40 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన పైపులైను,చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభోత్సవం చేశారు. రూ.10 లక్షలతో సాధారణ నిధులతో బిసి కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామాలలోని ప్రజలకు సకల సౌకర్యాలు కల్పిం చాలని లక్ష్యంతో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజ లకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నారని అన్నారు. పార్టీలక తీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ జనారంజక పాలన చేస్తూ, ఎవరైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారి కోసం జగనన్న సురక్ష పథకం ప్రవేశపెట్టి తద్వారా విప్లవత్మక మార్పుకు శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్ర చరిత్రలో ప్రతి కుటుంబా నికి సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలన్న అభివృద్ధి జరగాలన్న మరొకసారి జగనన్నకు ప్రజలంతా అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ సీనియర్ నాయకులు బాచిన చెంచు గరటయ్య, జిల్లా రైతు అధ్యక్షులు సంతమాగులూరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, సర్పంచి వల్లంరెడ్డి అమల, ధూళిపాళ్ల బుల్లిరామయ్య, జూపల్లి రాఘవరావు, పంచాయతీరాజ్ ఏఈ హనుమంతరావు, మండల కో-ఆప్షన్ సభ్యులు షేకు శ్రీనువలి, ప్రచార కమిటీ అధ్యక్షుడు టి.నరేష్, జి.సీతారెడ్డి, సుబ్బారావు, ఎర్రకుల వెంకటేశ్వర్లు, జి.వెంకట రామిరెడ్డి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దళిత కౌలు రైతులపై దాడి దుండగులను కఠినంగా శిక్షించాలి

- గుదే రాజారావు

విశాలాంధ్ర - బాపట్ల : దళిత కౌలు రైతులపై దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని అంబేద్కర్ యువజన సంఘ కన్వీనర్ గుదే రాజారావు తెలిపారు. బాపట్ల మండలం చుండూరుపల్లికి చెందిన మెరుగుమాలు సతీష్ అతని భార్య రాహేలును పథకం ప్రకారం వేటకొడవల్లతో అత్యంత కిరాతకంగా నరికి చంపడానికి ప్రయత్నించిన కమ్మ సామాజిక వర్గానికి చెందిన అంకమ్మ చౌదరి అతని భార్య సుజాతచ కుమారుడు దినేష్ మరో ఇద్దరిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి దళితులపై దాడులు విపరీతంగా పెరిగిపోయా యన్నారు. ఈనెల 27 తారీఖున మంగళవారం అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు సారథ్యంలో ఛలో బాపట్ల పిలుపునకు సిద్ధం చేశామన్నారు. రాజకీయ ఒత్తుళ్లకు తలవంచకుండా వెంటనే ముద్దాయిలను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాజారావు పోలీసులను కోరారు.

పాలేటి గంగమ్మకి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-పీసీపల్లి : మండలంలోని పెద అలవలపాడు పంచాయతీ పరిధిలోని వెంగళాపురం గ్రామం సమీపంలో పాలేటి ఒడ్డున వెలిసిన ప్రముఖ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భగీరథ పాలేటి గంగాభవాని అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సుదూర ప్రాంతాల నుండి అత్యధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. భక్తులు వేకువజామునే అమ్మవారికి పాల పొంగళ్ళు పెట్టుకుని నైవేద్యం సమర్పించారు. నూతన వాహనములు కొనుగోలు చేసినవారు అమ్మవారి సన్నిధిలో వాహనములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

సుమన్ వివాహ వేడుకల్లో 'ఉగ్ర'

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని రాళ్లపల్లి గ్రామానికి చెందిన తగరం సుమన్ వివాహ వేడుకలలో కనిగిరి మాజీ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు కర్నాటి భాస్కర్ రెడ్డి, యద్దనపూడి సాల్మన్ రాజ్, కొండు భాస్కర్ రెడ్డి, మండల తెలుగు రైతు అధ్యక్షులు మినీగా కాశయ్య, వెన్న రమణారెడ్డి, బొబ్బ తిరుపతిరెడ్డి, దా రెడ్డి సుబ్బారెడ్డి, కీసర రమణారెడ్డి, శ్రేష్ట ఫౌండేషన్ అధ్యక్షులు తగరం ఇమ్మానియేల్, బీసీ సెల్ అధ్యక్షులు పిన్నిక బాలకోటయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు గోన వెంకటయ్య, తదితర మండల నాయకులు పాల్గొన్నారు.

అశోక్ బాబును కలిసిన సింగరాయకొండ ఎస్సై

విశాలాంధ్ర-టంగుటూరు : సింగరాయకొండ నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన శ్రీరామ్ టంగుటూరులోని కారుమంచిలో కొండపి నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీరామ్ అశోక్ బాబుకు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ బాబు మాట్లాడుతూ సింగరాయ కొండలో శాంతి భద్రత పరిరక్షణకు కృషి చేయాలని ఎస్సైకు సూచించారు.

స్మార్ట్ మీటర్లు ఆలోచన విరమించుకోవాలి

విశాలాంధ్ర-వెలిగండ్ల : రాష్ట్రంలో ప్రతి ఇంటికి స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే ఉపసంహరించుకోవాలని మండల సిపిఎం పార్టీ నాయకులు రాయల మాల కొండయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రోగ్రెసి వ్ స్టడీ సర్కిల్ క్లాస్ నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో డిస్కములు కింద ఉన్న కరెంటు నేడు ప్రైవేటు పరం ధారబోస్తూ సౌత్ డిస్కం, సెంట్రల్ డిస్కం, ఆదాని ఎలక్ట్రానిక్ రకరకాల పేర్లతో విద్యుత్తు నడుస్తుందని ఇప్పుడు స్మార్ట్ మీటర్లు బిగించి ట్రూ ఆఫ్ఛార్జీ, కస్టమర్ చార్జి, సేవా పన్నులు, ఫిక్స్ చార్జీలు ,ఎలక్ట్రిసిటీ డ్యూటీతో అదనంగా వసూలు చేయటానికి సిద్ధపడుతున్నారని దానివలన పేద ,మధ్యతరగతి కుటుంబాలు వీధిన పడతాయని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలువెంటనే జోక్యం చేసుకొని స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని వారన్నారు, ఈ కార్యక్రమంలో కండేబాలకృష్ణ, పగడాల చక్రిరావు తదితరులు పాల్గొన్నారు.

దోర్నాల నూతన ఎస్సైగా పి.అంకమ్మరావు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : పెద్దదోర్నాల నూతన ఎస్సైగా ఆదివారం పి అంకమ్మరావు బాధ్యతలు స్వీకరిం చారు. దోర్నాల్లో ఎస్సై విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు ఒంగోలుకు బదిలీ కావడంతో అతని స్థానంలో పి అంకమ్మరావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ శాంతి భద్రతలకు, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యతనిస్తానని తెలిపారు. మండలంలోని సమస్యలను పరిష్కరిస్తారని తెలియజేశారు.

సింగరాయకొండ ఎస్సైగా టి.శ్రీరామ్

విశాలాంధ్ర-సింగరాయకొండ : సింగరాయకొండ నూతన ఎస్సైగా టీ శ్రీరామ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు విఆర్ నుండి సింగరాయకొండకు బదిలీపై వచ్చారు. సింగరాయకొండలో పనిచేస్తున్న ఎస్ఐ ఫిరోజ్ ఫాతిమా ఒంగోలు దిశగా బదిలీపై వెళ్లారు. శ్రీరామ్ మాట్లాడుతూ సింగరాయ కొండలో శాంతి భద్రతలకు ఆటంకం కలిగించిన అటువంటి వారు ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆయన తెలిపారు. కొండేపి నియోజకవర్గ ఇన్చార్జి వరి కుటి అశోక్ బాబును టంగుటూరు మండలం కారుమంచి గ్రామంలో గడపగడప లో ఉన్న వరికూటి అశోక్ బాబును ఎస్సై శ్రీరామ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పవిషం అందజేశారు.

నిరసన దీక్షను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-పర్చూరు: గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడి గించాలని, ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేయాలని కోరుతూ.. గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద ఈనెల 28న బుధవారం జరిగే నిరసన దీక్షలో రైతులు, ప్రజలు అధి కంగా పాల్గొని విజయవంతం చేయాలని నల్లమడ రైతు సంఘం అధ్య క్షులు కొల్లా రాజమోహనరావు పిలుపిచ్చారు. ఆదివారం మండలం లోని అడుసుమల్లి గ్రామంలో రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వాగ్దానాలతోనే సరిపెడుతుందని, విధులు మంజూరు చేయటం లేదని తెలిపారు. ప్రభుత్వం స్పందించి గుంటూరు ఛానల్ అభివృద్ధికి సహకరించాలన్నారు.

వైసీపీ ఆదేశిస్తే గిద్దలూరు నుంచి పోటీ చేస్తా

మాజీ ఎంపీపీ కడప వంశీధర్‌రెడ్డి

విశాలాంధ్ర-గిద్దలూరు : వైసీపీ అధిష్టానం ఆదేశిస్తే గిద్దలూరు నియోజకవర్గం నుంచి వైసిపి శాసనసభ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని నియోజకవర్గ వైసిపి నాయకులు, మాజీ మండల అధ్యక్షులు కడప వంశీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల ముఖ్య నాయకులతో ఆదివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధినేత వై యస్ జగన్ మోహన్ రెడ్డి ఆశీస్సులతో పార్టీ పెద్దలు టి.టి.డి ఛైర్మెన్ వై.వి సుబ్బారెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపి మాగుంట శ్రీనివాసరెడ్డి సహకారంతో 2024 సాధారణ ఎన్నికలలో తాను బరిలో దిగేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన తెలియజేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో విస్తృత పరిచయాలు ఉన్నాయని, అన్ని వర్గాల్లో ఆదరణ ఉందని, తమ పూర్వపు గ్రూప్ ముఖ్య నాయకులతో ఇప్పటికే మాట్లాడం జరిగిందని, వారి అందరి మద్దతు తనకు ఉందన్నారు. పార్టీ టిక్కెట్ ఆశిస్తున్న వారికి తాను వ్యతిరేకం కాదని, పార్టీ టిక్కెట్ ఎవ్వరు తెచ్చుకున్నా పార్టీ ఆదేశం ప్రకారం పనిచేస్తానని అన్నారు. ఇప్పటికే తాను సెరికల్చర్ సొసైటీ అధ్యక్షునిగా,గిద్దలూరు మండల పరిషత్ అధ్యక్షునిగా,ఉపాధ్యక్షునిగా పనిచేశానని,ఇప్పటికే తన సతీమణి తమ గ్రామపంచాయతీకి సర్పంచ్ గా పనిచేశారని,ప్రస్తుతం మండల అధ్యక్షురాలుగా పనిచేస్తున్నారని ఆయన అన్నారు. రానున్న ఎన్నికల్లో గిద్దలూరు నియోజక వర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి విజయ భాస్కర్ రెడ్డి,వైసీపీ సీనియర్ నాయకులు మాజీ సొసైటీ ఛైర్మన్ బొర్రా కృష్ణ రెడ్డి,ఇడమకల్లు సొసైటీ ఛైర్మెన్ ఎదురు శ్రీనువాస రెడ్డి,వైసీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి పల్లె సుధాకర్ రెడ్డి,మండల సచివాల కన్వీనర్ బి.ఓబులరావు, గిద్దలూరు పట్టణ యూత్ కన్వీనర్, పట్టణ సోషల్ మీడియా కన్వీనర్ పల్లె అశోక్‌రెడ్డి, మండల సోషల్ మీడియా కన్వీనర్ ఆగోల్ సాయి యాదవ్, మాజీ మండల కన్వీనర్ హిమశేకర్‌రెడ్డి, ఉయ్యాలవాడ సర్పంచ్ జంపాల భాస్కర్ రావు,ఓబుళాపురం సర్పంచ్ బొర్రా సుధాకర్ రెడ్డి, అదిమూర్తిపల్లె పర్వత పీరారెడ్డి, ఉయ్యాల వాడ ఎంపీటీసీ సురేష్, గండికోట ఎంపీటీసీ పిడుగు శ్రీనివాసరెడ్డి, కె.యస్.పల్లె మాజీ ఎంపీటీసీ పులి రామకృష్ణ రెడ్డి, నర్రాల లక్ష్మీరెడ్డి, సంజీరాయునిపేట ఎంపీటీసీ దేవదాస్, కొమ్ము నూరు ఎంపీటీసీ మల్లెబోయిన నాగేశ్వరావు, ఉయ్యాలవాడ మాజీ ఎంపీటీసీ ముస్తఫా, కొమ్మునూరు మాజీ సర్పంచ్ సంగన అంకిరెడ్డి, ముండ్లపాడు మాజీ ఎంపీటీసీ శేఖర్ రెడ్డి, ఓబుళాపురం మాజీ ఎంపీటీసీ పొట్రెడ్డి, వైస్ సర్పంచ్ సుబ్బారెడ్డి, బురుజుపల్లె శీలం రంగారెడ్డి, సంజీరాయునిపేట తాతిరెడ్డి రమణా రెడ్డి, కొంగలవీడు మాజీ సర్పంచ్ రాజా రెడ్డి,నరవ మాజీ ఎంపీటీసీ బోడె ఈశ్వర్ రెడ్డి,ఈదుల పాండు రంగారెడ్డి, తంబళ్లపల్లి వైసిపి నాయకులు శీలం శివశంకర్ రెడ్డి, వైజా కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ అంబవరం ఒంటెద్దు లక్ష్మీరెడ్డి, వెల్లుపల్లె తిరుపతిరెడ్డి, కె.యస్.పల్లె పిరయ్య, అబ్రాహం,కరుణాకర్ జయరాజు,దిగువమెట తుంగ రంగస్వామిరెడ్డి,ముండ్లపాడు జగన్ మోహన్ రెడ్డి, వెంటాపురం శేఖర్ రెడ్డి, రామకృష్ణ, రసూల్, తమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి,గొంటు నారాయణరెడ్డి, ఓబుల్‌రెడ్డి, ప్రతాప్, తమిదేలా కోటేశ్వరరెడ్డి, కర్నాటి బలవెంకటరెడ్డి, యాస్నం రామిరెడ్డి, శీలం ఆయాపురెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాస్ యాదవ్ ,అంజి రెడ్డి ,రమేష్ నాయుడు,షైక్ బాషా వైసీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

సేవే లక్ష్యంగా ఆవుల సంక్షేమ సేవా సంస్థ ప్రారంభం

విశాలాంధ్ర - బాపట్ల : సమాజంలో ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి నిస్వార్థంగా సేవ చేయాలనే లక్ష్యంతో ఆవుల సంక్షేమ సేవా సంస్థ ప్రారంభించినట్లు వ్యవస్థాపకులు విశ్రాంత ఆర్మీ ఉద్యోగి ఆవుల వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక బాపట్ల జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆవుల మహేష్ ఆధ్వర్యంలో ఆవుల సంక్షేమ సేవా సంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు ఆవుల మహేష్ మాట్లాడుతూ సంస్థ వ్యవ స్థాపకులు ఆవుల వెంకటేశ్వర్లు మానవతా దృక్పథంతో ఎన్నో సంవత్సరాలుగా స్వచ్ఛందంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. సేవలను విస్తృతం చేయాలనే ఉద్దేశ్యంతో ఆవుల సంక్షేమ సేవా సంస్థను ప్రారంభించి సమాజానికి మరెన్నో కార్య క్రమాలు చేయనున్నట్లు తెలి పారు. ప్రజా సేవలో తను ఎప్పుడు ముందుంటారని మచ్చలేని మనిషిగా సంస్థను ప్రారంభించి అందరినీ భాగస్వాములు చేసినందుకు గర్వకారణంగా ఉందన్నారు. వ్యవస్థాపకులు చైర్మన్ ఆవుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అందరూ బాగుండాలి అందులో మనం ఉండాలి మానవసేవయే మాధవసేవ ప్రార్థించే పెదవులు కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే మంచి సూక్తులతో సంస్థ ద్వారా అందరం ఒకే మాట మీద ముందుకు సాగుదామన్నారు. ఎవరైనా మానవత్వంతో సేవా భావంతో ఉన్నవారికి ఈ సంస్థలో ఎప్పుడు స్థానం ఉంటుందని అన్నారు. ముమ్మందు మరెన్నో మంచి కార్యక్రమాలను చేపడతామని పేర్కొన్నారు. అభాగ్యులకు ఈ సంస్థ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ముందుగా గౌరవ సభ్యులు రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ పి.బలరామకృష్ణ, ఎన్ఎస్పి రాజు, గిరిజారాణి, రోజున్‌బాబు, సుధాకర్ చీరాల కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : ప్రజలు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ వెంకటే శ్వర్లు తెలిపారు. బాపట్ల పోలీస్ శాఖ సౌజన్యంతో వి.ఆర్. క్రియేషన్స్ సమర్పణలో రూపుదిద్దుకుంటున్న సైబర్ క్రైమ్ షార్ట్ ఫిల్మ్‌ను ఆదివారం క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరలపట్ల అవగాహనకు లఘు చిత్రాలు దోహదపడతాయని దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు విపరీతంగా జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవటం వలన నేరాల భారీన పడకుండా ఉంటారన్నారు. ఏటీఎం కార్డులు, ఫోన్‌యాప్స్, ఆన్లైన్ యాప్స్‌ల ద్వారా చాలా మంది మోసపోతున్నారని తెలిపారు. ప్రజలం దరూ అప్రమత్తంగా ఉండి బ్యాంక్ లావాదేవీల వివరాలు ఎవరికి చెప్పకుండా జాగ్రత వహించాలన్నారు. జాబ్స్ ఇస్తామని, లోన్స్ ఇస్తామని ఫోన్లు చేసిన, ఫోన్లకు ఎటువంటి లింక్‌లు పంపినా నమ్మవద్దని ఈ విషయాలపై అందరు అవగాహన కలిగి ఉండాలన్నారు. పట్టణ సీఐ పి.క్రిష్ణయ్య మాట్లాడుతూ సామాజిక కార్యక్రమాలపై సైబర్ నేరగాళ్ల పట్ల అవగహన కార్యక్రమాలు చేసి సహకరిస్తున్న వి. ఆర్. క్రియేషన్స్ డైరెక్టర్ కె.చంద్ర శేఖర్, టీం సభ్యులకు అభినందనలు తెలిపారు. అనంతరం సైబర్ క్రైమ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇటువంటి సందేశాత్మక లఘుచిత్రాలను అందించే విషయంలో వి.ఆర్. క్రియేషన్స్ ఎప్పుడు ముందు ఉంటుందని త్వరలో షార్ట్ ఫిల్మ్ విడుదల చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై సుధాకర్, పట్టణ పోలీస్ శాఖ సిబ్బంది, వి.ఆర్. క్రియేషన్ సభ్యులు వెంకు, భ్రమర, శ్రీ హరి, శివశంకర్, కృష్ణ, కిషోర్, రమణ పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర - యద్దనపూడి : తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామిని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఇరువురు కలిసి దర్శించుకున్నారు, నియోజవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో కలిసిమెలిసి జీవించాలని వెంకటేశ్వర స్వామి నీ ప్రార్ధించినట్లు తెలిపారు. ఎమ్మెల్యేలతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, శ్రీకాంత్ (మున్న), సిద్దు, బెల్లంకొండ శ్రీనివాసరావు, హర్ష, ఈదల అనిల్, నాయకులు పాల్గొన్నారు.

గుంటి గంగ దేవాలయం వద్ద భక్తుల కోలాహలం

విశాలాంధ్ర-తాళ్లూరు : ప్రకాశం జిల్లాలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన తాళ్లూరు మండల తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడు గ్రామ శివారులో ఉన్న గుంటి గంగ క్షేత్రంలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. మండలంలోని వివిధ గ్రామాల నుండే కాక జిల్లా నలుమూలల నుండి భక్తులు పాల్గొని నైవేద్యాలతో అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. దర్శి సిఐ రామకోటయ్య కుటుంబ సమేతంగా దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ ఈవో ఏబీ భాస్కర్ రెడ్డి, సిఐ రామకోటయ్యను దేవాలయంలోకి సాదర స్వాగతం పలికారు. తదుపరి ఆయన దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 673 దర్శనం టికెట్లు, 12 వాహన పూజలు జరిగాయని, భక్తులు అమ్మవారికి 12 చీరలు ,10,368 రూపాయల విరాళాలు అందించారని, ఆదివారం ఒక్క రోజు 17,698 రూపాయలు ఆదాయం లభించినట్లు దేవాదాయ శాఖ రికార్డ్ అసిస్టెంట్ కే శ్రీనివాసరావు తెలిపారు .భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - చీరాల : పట్టణంలో శ్రీ గౌతమి డిగ్రీ కళాశాల, ఎన్ఎస్ సీ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో ఆది వారం కొత్తపేట రోడ్డులోని గౌతమి కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళా కార్యక్రమాలనికి విశేష స్పందన లభించింది. ఈ సంద ర్భంగా చీరాల చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అభ్యర్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వెయ్యికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ 27 కంపెనీలు ఈ జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఈ జాబ్ మేళా కార్యక్రమానికి ఆర్డీవో సరోజని ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో విద్యావంతులు ఎక్కువగా ఉండటం వారికి తగినన్ని ఉద్యోగులు లేకపోవడమే నిరుద్యోగ సమస్యకు కారణమన్నారు. అయితే ఇటువంటి జాబ్ మేళా కార్యక్రమాలు గ్రామీణ, చిన్నతరహా పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఉద్యోగం చిన్నది, పెద్దది అని చూడకుండా అవకాశం వచ్చిన దానికి అందిపుచ్చు కోవాలన్నారు. భవిష్యత్‌లో కూడా గౌతమి కళాశాల ఆధ్వర్యంలో ఇటువంటి మంచి కార్యక్రమాలు చేపట్టేలా యాజమాన్యం కూడా ముందుడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ ఎంసీహెచ్. వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ సీ డైరెక్టర్ శ్రీనివాసరావు, కళాశాల డైరెక్టర్లు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అఖండ సాయి నామ సప్తాహం ప్రారంభం

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి శ్రీ శిరిడి సాయిబాబా దేవస్థానంలో పూజ్య గురుదేవులు శ్రీ శ్యాం చరణ్ బాబా గారి దివ్య ఆశీస్సులతో గత 35 సంవత్సరముల నుండి జరుగుచున్న అఖండ సాయి నామ సప్తాహం ఆదివారం ప్రారంభమైంది. ఉదయం బాబాకు కాకడా హారతి, అభిషేకములు నిర్వహించారు. తొలుత సానికొమ్ము రంగనాయకులురెడ్డి, పద్మావతి దంపతులచే అఖండ జ్యోతి వెలిగించి పూజా కార్యక్రమాలు మొదలుపెట్టారు. ధనేకుల తిరుమలరావు, తిరుపాలమ్మ మరియు ధనికుల నేతాజీ నాగలక్ష్మి దంపతులచే గోపూజ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు దేవకి సుబ్రహ్మణ్యం, భాగ్యలక్ష్మి దంపతులుచే" ఓం సాయి శ్రీ సాయి జయజయ సాయి నామ సంకీర్తన కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీ సాయి మహిళా భక్త సంఘం వారిచే పట్టణ పురవీధులలో భిక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు. సూరసాని లక్ష్మీ నరసారెడ్డి దంపతులు, భూతలపల్లి మాలకొండారెడ్డి దంపతులచే భోజన కార్యక్రమాల్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యవర్గ సభ్యులు పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మారావు, టంగుటూరి గోవిందరావు, వాగిచర్ల వెంకటేశ్వర్లు, మండ్ల వెంకటేశ్వర్లు, ఈర్ల గురవయ్య, వి సి రామశాస్త్రి, ఏసీ చెంచులు కొప్పుకోటయ్య, పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు.

మాజీ సర్పంచి గురవయ్య మృతికి సంతాపం

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి మండలం జమ్మలమడక మాజీ సర్పంచ్ పోతుల గురవయ్య (60) ఆదివారం మృతి చెందటం బాధాకరమని జడ్పీటిసి మడ తల కస్తూరి రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోతుల గురవయ్యతో గత 30 సంవత్సరాలుగా రాజకీ యంలో సన్నిహితంగా నమ్మకస్తుడైన స్నేహితునిగా ఉన్నాడని నిస్వార్థమైన రాజకీయ నాయకులు కోల్పోయి నట్లు వెల్లడించారు. పోతుల గురవయ్య కుటుంబ సభ్యు లకు జడ్పీటిసి మడతల కస్తూరి రెడ్డి, వంగపాడు ఎంపిటిసి మడతల హజరతమ్మ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జనజాగృతి సభ కరపత్రం ఆవిష్కరణ

విశాలాంధ్ర-అర్ధవీడు : మండలంలోని పాపినేనిపల్లి గ్రామంలో ఆదివారం మాదిగల జన జాగృతి సభ కర పత్రాన్ని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ బొడిచర్ల రాజు మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గోనమోహన్రావు మాదిగ గ్రామస్తులతో ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్లో మాదిగల ఆత్మగౌరవంతో పాటు హక్కుల సాధనకు మాది గలు మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జూలై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మాదిగల జన జాగృతి సభ విజయవాడలో జింఖాన గ్రౌండ్స్ నందు జరుగునని తెలిపారు.

ఎస్సైకి శుభాకాంక్షలు

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : హనుమంతుని పాడు మండల పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సబ్ ఇన్స్పెక్టర్ గా నూతన బాధ్యతలు చేపట్టిన పులి శివ నాగరాజును హనుమంతునిపాడు మండల టీడీపీ నాయకులు మండల పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి,దేవిరెడ్డి రఘునాథ్ కాశిరెడ్డి, మురహరి నరసయ్య, గాయం రామిరెడ్డి, కందుల వెంకటసుబ్బారెడ్డి, చీకటి వెంకట సుబ్బయ్య, కూడలి దశరథ,ఆలా బసవయ్య,కూరాకు బాల నారాయణ, షేక్ జిలాని,ఆనా కనకరాజు, సానికొమ్ము సుబ్బయ్య, సూరపురెడ్డి రామలింగారెడ్డి,కుందురు బ్రహ్మారెడ్డి,మల్లెల తిరుపతయ్య, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, పెంచికల రామకృష్ణ, ఆకుపాటి శ్రీనివాసులు, యలనాటి చిన్న కోటయ్య,నాగూరి కోటయ్య, కాటేపల్లి చిన్న ఆవులయ్య, గుమ్మ కొండయ్య,కొండపురెడ్డి నాగిరెడ్డి,గోరా రంగయ్య, మాదాల గరటయ్య, పగడాల శ్రీరాములురెడ్డి, కొల్లంరెడ్డి శివ శంకర్‌రెడ్డిలు మరియు తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలసి ఎస్సై పులి శివ నాగరాజును శాలవాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

వైభవంగా నాంచారమ్మ కొలుపులు

విశాలాంధ్ర - కర్లపాలెం : మండలం దమ్మనవారిపాలెం గ్రామంలో గ్రామ దేవత నాంచారమ్మ తల్లి కొలుపులు ఆఖరి రోజు ఆదివారం వైభవంగా జరిగింది. భక్తులు ఆలయంలో రాశి పొంగల్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు పెట్టారు.భక్తులు తమ మొక్కులు చెల్లించుకుని ఈ ఏడాది పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకొన్నారు.

దూరవిద్య ద్వారా వ్యవసాయ పరిజ్ఞాన కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర - బాపట్ల : ఆచార్య ఎన్జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం దూరవిద్య ద్వారా వ్యవసాయ పరిజ్ఞాన సర్టిఫికెట్ కోర్సులకు రైతులు, మహిళలు యువత దరఖాస్తు చేసుకోవచ్చని బాపట్ల ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎంసి ఓబయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల ద్వారా యువతీ యువకులకు సేంద్రీయ వ్యవసాయం,మిద్దె తోటల పెంపకం, తేనెటీగల పెంపకం, పుట్టగొడుగులు పెంపకంపై జూలై నుండి 8 వారాలపాటు కోర్సులు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గల వారు రూ.1500 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8008788776, 9989623808 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

వేడెక్కిన రేపల్లె రాజకీయం..!

విశాలాంధ్ర - రేపల్లె : నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఎన్నికల ప్రచారాన్ని తలదన్నే రీతిలో అధికార పార్టీ నాయకులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పార్టీ నాయ కులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొంటూ ప్రభుత్వానికి మరోసారి అండగా ఉండాలని ప్రజలను అభ్యర్థిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముందస్తు ఎన్నికలు ఉండవని చెప్తూనే ప్రచార హోరు పెంచటం వెనుక రాజకీయ వ్యూహం దాగి ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రతి విషయాన్ని వైసీపీ సోషల్ మీడియా సిబ్బంది, ఐ ప్యాక్ టీమ్ సమన్వయంతో ఓటరులను ఆకర్శించే విధంగా ప్రతిపక్ష ఎమ్మెల్యేపై పోస్టులు పెడుతూ ప్రచారం చేస్తున్నారు. టీడీపీ గ్రాఫ్ పడిపోయిందని రానున్న ఎన్నికల్లో వైసీపీ మరలా అధికారంలోకి వస్తుందని జోస్యం చెబుతూ ప్రచారం చేస్తున్నారు. గడపకు మన ప్రభుత్వం పేరుతో వైసిపి కేడర్ మొత్తం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలతో మమేకం అవుతున్నారు. మరో ప్రక్క జగనన్నకు చెబుదాం కొనసాగింపులో భాగంగా జగనన్న సురక్ష పేరుతో అధికారులు, సచివాలయ సిబ్బంది వాలంట రీలు, గృహ సారథులు ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. అటు నాయకులు, ఇటు అధికారులు ఒకరి తరువాత మరొకరు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అందించే పలు సేవలను నెల రోజుల పాటు ఉచితంగా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. వాలంటరీలు ప్రతి ఇంటికి వెళ్లి వారికి అందించాల్సిన సేవలను నమోదు చేసుకోవాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందనివారిని గుర్తించి తక్షణమే వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతుందని అర్హతే ప్రామాణికంగా కుల మత పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథ కాలు అందిస్తున్నామని పదే పదే నొక్కి వక్కాణిస్తున్నరు. మరో వైపు ప్రతిపక్ష పార్టీ నాయకులు టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్ గత కొన్ని నెలలుగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేరు. ఎదో మొక్కుబడి కార్యక్ర మాలకు తప్ప, ప్రజలకు చేరువైన సంఘటలను దాదాపు లేవనే చెప్పాలి. ఇది అదునుగా భావించిన వైసీపీ సోషల్ మీడియాలో ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్‌పై ఘాటుగా విమర్శలు చేస్తున్నారు. విజి టింగ్ వీసాపై వచ్చే ఎమ్మెల్యే అంటూ పోస్టులు పెడుతు న్నారు. ఎమ్మెల్యే అందుబా టులో ఉండకపోవటంతో టీడీపీ నాయకులకు నైరాశ్యం అలుముకుంది. నాయకుల మధ్య ఉన్న సమన్వయ లోపం కారణంగా నాయకుడు వచ్చినప్పుడే పార్టీ కార్యాలయానికి వస్తున్నారు తప్ప ఏ కార్యక్రమాన్ని చేయటం లేదని పార్టీ శ్రేణుల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. మొన్నటి వరకు నియోజకవర్గంలో టీడీపీ ఓటుబ్యాంక్ 60 శాతం ఉండగా నేడు 50 శాతంగా ఉందని ఓ సర్వే రిపోర్టు అంచనా. ఇదే పరిస్థితి కోన సాగితే రానున్న ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని రాజకీయ మేధావులు హెచ్చరిస్తున్నారు. 2019 ఎన్నికలకు ముందు టీడీపీ నేతలంతా అసెంబ్లీలో ఉంటే అప్పటి ప్రతిపక్ష పార్టీ నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర పేరుతో, బసు యాత్రలు, ప్రత్యేక సభలు సమావేశాలతో ఎమ్మెల్యేలను ఎంపీలను సిద్ధం చేసుకుని ప్రజల్లో ఉన్నారు. ప్రస్తుతం సీఎం జగన్ మోహన్ రెడ్డి నాయకులతోను, అధికారులతోను సమీక్షా సమావేశాలు నిర్వహించి వారికి దిశ నిర్దేశం చేస్తూ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలు కుట్రలు కుయుక్తులు పన్నుతూ మనందరి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారంటూ ప్రజలకు చేరువ అయ్యేందుకు కృషి చేస్తున్నారు. రాష్ట్ర చరిత్రలోనే 2024 ఎన్నికలు అత్యంత ప్రాధాన్యను సంతరించుకున్నాయి. ఈ ఎన్నికలు అత్యంత ఖరీదు అయినవి కావటం ఒక విశేషం కాగా ఈ ఎన్ని కల్లో ఏ పార్టీ ఓడిపోయిన, ఆ పార్టీకి కొంత కాలం మనుగడ ఉండదని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

వైసీపీ వ్యూహాత్మక ఎన్నికల ప్రచారం
అధికారమే లక్ష్యంగా అడుగులు
వినూత్న కార్యక్రమాలతో నిరంతరం ప్రజల్లో
టీడీపీ గ్రాఫ్ పడిపోయిందంటూ ప్రచారం